సమాచారం

11 మందికి కరోనా నెగటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 11 మందికి అనుమానితులకు సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో పరీక్షలు చేయగా అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు.

30 నుంచి అమృతాలయ అష్టమ వార్షికోత్సవాలు

జగద్గిరిగుట్ట: చింతల్ గణేష్ నగర్‌లోని అమృతాలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 01వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఆలయంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీఅభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.

క్లుప్తంగా

ప్రమాణ స్వీకారం

జగద్గిరిగుట్ట: షిరిడీ హిల్స్‌లో శ్రీసాయి రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన అధ్యక్షుడు సీహెచ్ దాసు, జనరల సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ శేషు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి గెలిపించిన బస్తీ వాసులకు రుణపడి ఉంటామన్నారు. స్థానికంగా ఏ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రప్ప, రాంబాబు, వీరారెడ్డి, మహేష్, విమలాదేవి, సంధ్యా సాగర్, రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్ మహిళా నాయకురాలు యాదమ్మ ఆధ్వర్యంలో మణెమ్మ, లక్ష్మి మిత్ర బృందం సభ్యులు ఆదివారం షాపూర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై చేపడుతున్న పోరాటాలపై ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్, జేమ్స్, సంజీవరెడ్డి, పండరిరావు, నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అన్నపూర్ణ, సువర్ణ, లక్ష్మి, కౌసల్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీగా ధనలక్ష్మి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీగా ధనలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో నిరుపేద కుటుంబానికి చెందిన సీహెచ్ వరలక్ష్మికి హోప్ ఆఫ్ హంగర్ సంస్థ అందజేసిన నెలకు సరిపడా నిత్యావసరాలను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగ వరలక్ష్మీ కుమారుడు దైవ ప్రసాద్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని అతని చికిత్స నిమిత్తం తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వాసుదేవరావు, కృష్ణం నాయుడు, ఐలయ్య గౌడ్, రవికిరణ్, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు మాధవాచారి, జనరల్ సెక్రటరీ ఫిరోజ్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబిహా బేగం విచ్చేసి నూతన అధ్యక్ష, సెక్రటరీ, అసోసియేషన్ సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుల లింగాల ఐలయ్య, మాధవాచారి, లింగం, రవీందర్, గఫూర్, శ్యామ్ సుందర్‌రెడ్డి, రాజయ్య, ఎండీ ఫిరోజ్, నిజాం, ఎ. అనిల్, టి. అనిల్, అలెక్స్, లోహిత్ అక్షన్, ఒమేర్, అహ్మద్, బాబుమియా పాల్గొన్నారు.

మీకెందుకంతా శ్రమ నేను తీసుకొస్తా...



పిల్లలు చిన్న సైకిల్ నడుపుతూ సంతోషిస్తారు. అది చూసే తల్లిదండ్రులు ఎంతో సంబరపడిపోతారు. కానీ జగద్గిరిగుట్ట జన్మభూమి మార్కెట్ సమీపంలో ఆదివారం ఉదయం కనిపించిన ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. అమ్మానాన్న మీకెందుకంతా శ్రమ.. కూరగాయలను నా బండిలో పెట్టుకుని తీసుకొస్తానని ఆ చిన్నోడు అన్నట్లుగా అనిపించింది దృశ్యం. -జగద్గిరిగుట్ట

మేమూ జిమ్ చేస్తాం..



జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప-1వ బ్లాక్ సమీపంలోని పార్క్‌లో గతేడాది ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ జిమ్‌లోని పరికరాలతో పెద్దలు ఉపయోగించుకోవడం పక్కన పెడితే.. పిల్లలు మాత్రం బాగా ఎంజాయ్ చేస్తున్నారు. గృహకల్ప సముదాయంలోని పిల్లలు మేమూ జిమ్ చేస్తాం.. తగ్గేదే లే అంటూ జిమ్ పరికరాలతో ఆడుకుంటూ సన్ డేను ఫన్‌డేగా మార్చుకుంటున్నారు. - జగద్గిరిగుట్ట

మన్ కీ బాత్



గాజులరామారం డివిజన్ 227, 229 బూత్‌ల బీజేపీ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం 227 బూత్ అధ్యక్షుడు శరగడం నర్సింగరావు నివాసంలో ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమానికి కేకేఎం ట్రస్ట్ చైర్మన్, బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కూన శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. - సుభాష్‌నగర్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం



సన్మాన్ బెల్మోర్ విల్లాస్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



దివ్యాంగుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ సన్మాన్ బెల్మోర్ విల్లాస్‌లో రూ.28లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని అన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్‌ను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి జీతేంద్రనాథ్, కిషోర్, సురేష్, శ్రీకాంత్, కమల్, వార్డు సభ్యులు ఇందిరారెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ దివ్యాంగుల ప్రత్యేక శాఖ ఏర్పాటు దేశానికే ఆదర్శం..

సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలకు ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రెయిలీ కేలండర్‌ను ఆవిష్కరించి ఎమ్మెల్యే మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ వైకల్యాన్ని జయించి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడం దేశానికే ఆదర్శమన్నారు. దివ్యాంగులకు రూ.3,116 పింఛన్ ఇస్తోందని పేర్కొన్నారు. దివ్యాంగులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ వీరరాఘవన్, వెల్ఫేర్ అసోసియేషన్ డిసేబుల్డ్ ప్రెసిడెంట్ అంజయ్య, ప్రవీణ్ కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, నాయకులు మన్నె రాజు, రవీందర్ ముదిరాజ్, వెంకటస్వామి, పందిరి యాదగిరి, రాజ్‌కుమార్, తారాసింగ్, లూయిస్ బ్రెయిలీ సూరారం అసోసియేషన్ సభ్యులు సత్యం, రాజ్‌కుమార్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రూ.900కోట్ల టర్నోవర్ సాధించాం

ఆదర్శ్ బ్యాంక్ సీఈవో మదన గోపాలస్వామి



ఆదర్శ్ బ్యాంకు పురోగతి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఈవో మదన గోపాలస్వామి, డీసీవో శ్రీనివాసమూర్తి తదితరులు

రంగారెడ్డినగర్: ఆదర్శ్ కో.ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం షాపూర్‌నగర్‌లోని సుభమ్ సెలబ్రేషన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్. ఉమాపతి, రిటైర్డ్ అడిషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటీవ్ సొసైటీస్ ఎస్.రామనాథస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మదనగోపాలస్వామి, చైర్మన్ గంగారామ్ మాట్లాడారు. నగరంలో 15 బ్రాంచ్‌లతో రూ.900 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. గడిచిన 25 సంవత్సరాల కాలంలో కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడంతోనే ఇది సాధ్యపడిందని పేర్కొన్నారు.

◆ గౌరవ అతిథిగా హాజరైన మేడ్చల్-మల్కాజ్‌గిరి డీసీవో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ... బ్యాంకింగ్ రెగ్యులేటరీ గైడ్‌లైన్స్‌ను తూచా తప్పకుండా పాటిస్తున్న కో.ఆపరేటీవ్ బ్యాంక్‌గా ఆదర్శ్ బ్యాంక్ ఉదాహరణగా పేర్కొనవచ్చన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ సాధించిన పురోగతిని పొందు పరిచిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజధాని కో.ఆపేటీవ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమిరెడ్డి నర్సింహారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్లు అచ్యుత రామారావు, జీవీనరసింహారావు, శ్రీలక్ష్మి అట్లూరి, సుజనా నీలకుడితి, వెలిచెట్టి సుబ్బారావు, వెంకటరత్నం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దుర్మార్గపు పాలనకు స్వస్తి పలకాలి

బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



చంద్రగిరినగర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానన్న సీఎం కేసీఆర్ తాగుబోతుల తెలంగాణగా మార్చారని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో ఆదివారం బన్నెనోల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరంశ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బస్తీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వాటి పరిష్కారం కోసం బీజేపీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

◆ రాష్ట్రం అభివృద్ధి కావాలంటే బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిందేనని అన్నారు. 2009 ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ ప్రజలు రాష్ట్రంలోనే చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి కేసీఆర్ దుర్మార్గపు పాలనకు స్వస్తి పలకాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్‌లు కృష్ణయాదవ్, రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, నాయకులు కావాలి శ్రీను, రాం నర్సయ్య, సంతోష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో విజయం సాధిస్తాం

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గోపాల్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ బలోపేతం అవుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా మెజార్టీ సాధించి విజయం సాధిస్తామని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ అన్నారు. షాపూర్‌నగర్ ప్రధాన చౌరస్తా వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ఆదివారం ఆయన శుభ్రం చేసి పాలతో కడిగారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా సమస్యలపై పాదయాత్ర చేపడతామని కార్యకర్తల సమావేశంలో గోపాల్ స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో తప్పకుండా తెలంగాణలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన వైఎస్సార్‌టీపీ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కె.వెంకటేష్, రామకృష్ణ, నరసింహారెడ్డి, శ్రీను, గణేష్, రవి, రఫీక్, శేఖర్ తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గోపాల్ తదితరులు

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు గుణపాఠం చెబుతాం



జగిత్యాల చైర్మన్ భోగా శ్రావణికి సంఘీభావం తెలుపుతున్న పద్మశాలి కులస్తులు

జగద్గిరిగుట్ట: అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుదే రాజశేఖర్ అన్నారు. ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన జగిత్యాల మున్సిపల్ చైర్మన్ భోగా శ్రావణికి మద్దతుగా ఆదివారం పద్మశాలి కులస్తులు జగిత్యాలకు తరలి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. బీసీ మహిళ, పద్మశాలి వేధింపులకు గురిచేసి అవమానించడంతో పద్మశాలి సమాజం రగిలిపోతోందన్నారు. ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేంత వరకు నిద్రపోనీయమని హెచ్చరించారు. పద్మశాలి సంఘం నాయకులు జనార్దన్, నాగభూషణం, ప్రభాకర్, రాము తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: మేదరి మహేంద్ర దుకాణదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు అంబదాస్ అన్నారు. ఇంద్రేశం గ్రామ సమీపంలో ఆదివారం పటాన్‌చెరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నంది కంటి నర్సింలు, అధ్యక్షుడిగా లోక్‌దాస్, కార్యదర్శిగా పాతకోటి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా పోతుల మల్లేష్, కోశాధికారిగా శేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ దుకాణదారులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం, వెదురు బొంగుల దుకాణదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక మహంకాళి ఆలయంలో అఖండ హరి కీర్తన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తనలో ఆయన పాల్గొని పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ సంకీర్తనలతో 24 గంటలపాటు భగవంతుడి సన్నిధిలో గడపటం మంచి విషయమన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తాను ఎప్పుడు ముందుంటానని, ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తానని తెలిపారు. అనంతరం నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిషన్ ప్రసాద్, సంతోష్ సింగ్, ధనుష్ శర్మ, మనోజ్ కుమార్, మున్నా యాదవ్, అయోధ్య, లలన్ సింగ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు):మాదారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ రూ.1.16లక్షలను విరాళంగా అందించారు.ఆదివారం ఆయన ఈ మొత్తాన్ని ఆలయ బాధ్యులకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న ఆహార పండుగ

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన సైక్లోథాన్‌లో భాగంగా చిరుధాన్యాల ఆహార పండుగ పేరిట స్టాల్స్ నిర్వహించారు. సైక్లిస్టులు, సందర్శకులు వివిధ రకాల చిరుధాన్యాలతో కూడిన వంటలను ఆరగించారు. స్టాల్స్ నిర్వాహకులు చిరుధాన్యాల ప్రత్యేకతను, వాటిని ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను సందర్శకులకు వివరించారు. పిండి వంటలు, పచ్చళ్లు, ఆహార ధాన్యాలను విక్రయించారు.

వస్తు సేకరణకు విశేష స్పందన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే గృహ సముదాయంలో గూంజ్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వస్తు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రాండే వాసుల నుంచి స్పందన లభించింది. అనాథల కోసం వస్తువులను అందజేసేందుకు పలువురు ముందుకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రాండే వాసులు వాడని వస్తువులతో పాటు చిన్నారులు, యువత, మహిళల డ్రెస్‌లను అందజేశారు.

పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తాం

హార్టికల్చర్ అధికారి రఘువీర్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని హార్టికల్చర్ అధికారి రఘువీర్ అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్కుల్లో నీడనిచ్చే చెట్లతో పాటు పచ్చని మొక్కలు, పూల మొక్కలను నాటుతున్నామని అన్నారు. కుటుంబ సభ్యులు సంతోషంగా గడిపేందుకు పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

దుండిగల్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.3.41 లక్షల చెక్కులను 10 లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్‌తో లక్షలాది మంది జనం లబ్ధి పొందారని అన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.55వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అంజయ్య నగర్‌కు చెందిన మీనాబాయి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైహింద్, వెంకటేష్, సంతోష్, ప్రభాకర్, వనం శ్రీను, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మస్కభూపతిపూర్‌కు చెందిన భాస్కర్‌రావు కుమారుడు ఆరమ్ కిషోర్‌కుమార్ (34) భౌరంపేట్ సింహపురి కాలనీలోని సాయిద్వారక అపార్ట్‌మెంట్స్‌లో తన స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కిషోర్‌కుమార్‌కు అప్పులు ఎక్కువ కావడంతో కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 11గంటలకు తన స్నేహితుడి దుకాణం వద్ద దింపిన అనంతరం ఇంటికి వచ్చిన కిషోర్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలి



ఎన్‌సీఎల్ నార్త్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు,చిన్నారులు

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో ప్రజలు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. గతేడాది సంవత్సరం వీధి కుక్కల దాడిల కాలనీకి చెందిన 45 మంది చిన్నారులు గాయపడ్డారు. వీరిలో ప్రణీత్‌రెడ్డి, అనిరుధ్‌గౌడ్, శాన్వి వర్మలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమ కాలనీలో వీధి కుక్కల బెడదపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇప్పటికైనా కళ్లు తెరవాలని కోరారు. తమ కాలనీలో నెలలో రెండుసార్లు స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీధి కుక్కలను నియంత్రించాలని కోరారు.